క్లుప్తంగా

ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు గుర్తించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పొదలకూరు : మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్యారోగ్యశాఖ అధికారులు, సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తించి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ నెల 30 నుంచి అక్టోబరు 28వ తేదీ వరకు సచివాలయాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తించిన వారికి స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందువల్ల ప్రజలు ఇళ్ల వద్దకు వచ్చే వైద్య సిబ్బందికి ఆరోగ్య సమస్యలు ఉంటే వివరాలు వెల్లడించాలని సూచించారు. గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించే ముందురోజు ప్రజలందరికీ తెలియజేస్తామని, వలంటీర్లు రోగులను శిబిరానికి తీసుకొస్తారని వివరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబు, వైద్యాధికారులు వి.నరసింహరావు, కిరణ్‌రిషిత, కావ్య, విస్తరణాధికారి రవికుమార్, సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, పీహెచ్‌ఎన్ రమణమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీనివాసులు, మస్తాన్‌బీ పాల్గొన్నారు.

ఉత్తమ ఎంఈఓకు సన్మానం



తోటపల్లిగూడూరు : జిల్లాస్థాయిలో ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా అవార్డు అందుకున్న సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డిని బుధవారం ఘనంగా సన్మానించారు. చిన్నచెరుకూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, పాఠశాల సిబ్బంది ఎంఈఓను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ సేవలను కొనియాడారు. అనంతరం పాఠశాల చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ-2 జయరామనాయుడు, పాఠశాల హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా, ఉపాధ్యాయినులు వసంతలక్ష్మి, విద్యుల్లత, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగే మేలు

- రైతులకు శాస్త్రవేత్తల సూచనలు



పొదలకూరు : వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగే మేలని శాస్త్రవేత్తలు నాగమణి, వెంకటేశ్వర్లు సూచించారు. పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులతో శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ మెట్టపైర్లు సాగు చేయాలని రైతులకు సూచించారు. ఆముదాలు, ఉలవ, అలసంద పైర్లకు బెట్టను తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. వ్యవసాయంలో అధిక పెట్టుబడులు రైతులకు ప్రధాన సమస్యగా మారిందని, పెట్టుబడులను తగ్గించుకోవాల్సిందిగా సూచించారు. లింగాకర్షక బుట్టలు, తెలుపు, పసుపు జిగురు అట్టలు, ఎరపంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు ఉచితంగా లింగాకర్షక బుట్టలు, పసుపు అట్టలు పంపిణీ చేశారు. జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త పి.సత్యవాణి అపరాలసాగులో తెగుళ్ల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏడీఏ లక్ష్మీమాధవి విత్తనశుద్ధి, పచ్చిరొట్ట ఎరువులపై సలహాలు ఇచ్చారు. ఏఓబీ చక్రవర్తి భూసార పరీక్షలు, ఉపయోగాలను వివరించారు. ఏడీఏ కే శివనాయక్ ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలు, అగ్రిల్యాబ్‌లో విత్తనాలు, ఎరువుల పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానాధికారి ఎంవీ సుబ్బారెడ్డి, ఏపీఎంఐ పీడీ బి.శ్రీనివాసులు పాల్గొని సలహాలు, సూచనలు చేశారు.

చిరుధాన్యాల్లో మెండుగా పోషకాలు

కొడవలూరు : చిరుధాన్యాల్లో పోషకాలు మెండుగా ఉంటాయని ఏసీడీపీఓ టీ అరుణ తెలిపారు. మండలంలోని కొత్తవంగల్లులో పోషణ్ మహాభియాన్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ వీ పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పీ జాస్మిన్, ఏఎస్‌ఎం శాంతకుమారి, డీఏ శ్రీనివాసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు కామేశ్వరి, సుప్రజ, కుమారి, సుజాత, వెంకటరమణమ్మ, విజయ, మాధవి, పద్మ పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహిద్దాం

- సింగిల్‌విండో విధానంలో మండపాలకు అనుమతి
- విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి


విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి లోగో, బ్యానర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): నగరంలో గణేశ్ ఉత్సవాలను సంఘటితంగా ఘనంగా నిర్వహించుకుందామని విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు పిలుపునిచ్చారు. విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలోని గాంధీబొమ్మ సమీపంలోని టీవీఎస్ కల్యాణ సదన్‌లో గణేశ్ ఉత్సవాల నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. విక్రమ సింహపురి ఉత్సవ సమితి లోగో, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యనాగేశ్వరరావు మాట్లాడారు. నగరంలో గణేశ్ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పెద్ద సంఖ్యలో నిర్వాహకులు హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు. ఉత్సవాల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయం చేస్తామన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్ మాట్లాడుతూ టీవీఎస్ కల్యాణసదన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి కార్యాలయం ఈ నెల 23న ఉత్సవాలు ముగిసే వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8గంటల వరకు పనిచేస్తుందన్నారు. గణేశ్ ఉత్సవాల నిర్వాహకులు తమ మండపాల వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. సమితి గౌరవాధ్యక్షుడు బయ్యా వాసు మాట్లాడుతూ ముంబై, హైదరాబాద్ నగరాలకు దీటుగా సింహపురిలో వినాయకచవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలకు అవసరమైన పోలీసు, విద్యుత్, మున్సిపల్, తదితర అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులను సింగిల్ విండో విధానంలో మంజూరు చేసేలా పనిచేస్తున్నామన్నారు. నగరంలోని మండపాల నిర్వాహకులు టీవీఎస్ కల్యాణ సదన్‌లోని కార్యాలయంలో అన్ని అనుమతుల కోసం సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో ఆనం రంగమయూర్‌రెడ్డి, ఏవీఆర్ మోహన్‌రావు, విజయకుమార్‌రెడ్డి, కొణిదెల సుధీర్, టీ భాస్కరరెడ్డి, కృష్ణారెడ్డి, చంద్ర, కేవీ సుబ్రహ్మణ్యం, పేటేటి భాస్కర్, హర్షవర్ధన్, ఉత్సవ సమితి నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి సన్మానం



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జిల్లా డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రి కాకాణిని శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వినాయక చవితి పండగ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పోలీసు శాఖ ద్వారా అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. స్పందించిన మంత్రి కాకాణి నిబంధనల మేరకు డ్యాన్స్ అసోసియేషన్ ఐడీ కార్డులతో పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని, సాంస్కృతిక కార్యక్రమాలు అందరూ చూసి వినోదించేలా ఉండాలని సూచించారు. డ్యాన్స్ మాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జాకీర్, కార్యదర్శి కంచి జనార్దన్, ఉపాధ్యక్షుడు శ్రీసాయి, డ్యాన్స్‌మాస్టర్లు కోదండపాణి, ఆర్టీసీ కరీముల్లా, వేలాంగణి రాజు, సతీష్, ఇబ్రహీం, శ్రీసాయి ఈవెంట్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏకు ప్రభుత్వ గుర్తింపుపై సంబరాలు


హర్షం వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూఏ కార్మికులు

నెల్లూరు సిటీ: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ)కు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడంపై ఆ యూనియన్ కార్యవర్గ సభ్యులు, కార్మికులు బుధవారం స్వీట్లు పంచుకుని సంబరాలు జరుపుకొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎండీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎన్‌ఎంయూఏ నెల్లూరు-1 డిపో అధ్యక్షుడు బీఆర్ ప్రసాద్, కార్యదర్శి చెంచయ్య, రీజనల్ కార్యదర్శి జానా వెంకటేశ్వర్లు, జిల్లా చైర్మన్ టీ మురళీమోహన్‌రెడ్డి, జిల్లా చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, నెల్లూరు-1 డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్, నెల్లూరు-2 డిపో కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ


నూతన పింఛన్‌ను అందజేస్తున్న మొయిళ్ల గౌరీ

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గ పరిధిలోని 21వ డివిజన్‌లో కొత్త పింఛన్లను లబ్ధిదారులకు ఆ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరీ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు మంజూరు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెంచల్‌నర్సారెడ్డి, రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాదేశికన్ మహోత్సవాలు ప్రారంభం



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేటలోని గోపురంవీధిలోని శ్రీవేదాంత దేశికర్ దేవస్థానంలో అహోబిల మఠం ప్రథమ పీఠాధిపతి మన్నిగమాంత మహాదేశికుల, శ్రీమత్ ఆదివణ్ శఠగోప యతీంద్ర మహాదేశికుల వారి 755వ తిరునక్షత్ర అవతార మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మహాదేశికుల వారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. వేద దివ్య ప్రబంధగోష్ఠితో ప్రారంభమైన ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని మహాదేశికుల వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ నెల 25వ తేదీ వరకు ఉత్సవాలు విశేషంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం


వాలీబాల్ ఆడుతున్న బాలికలు

బుచ్చిరెడ్డిపాళెం : క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలోని పెనుబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు స్కూల్ గేమ్స్ దోహదపడుతాయన్నారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్నారని, గెలుపొందిన వారు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు దిలీప్, రత్నం, హెచ్‌ఎం అనంతకృష్ణ, పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని నవాబుపేట రైతు బజార్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బోడిగాడితోట విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగునని ఈస్ట్-1 సెక్షన్ ఏఈ విజయ్‌కుమార్ బుధవారం తెలిపారు. మైపాడు రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో నూతనంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేస్తుండడంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు. బోడిగాడితోట, వైకుంఠపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్, శ్రీనివాసనగర్, మైపాడురోడ్డు, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు,రేపు జాబ్‌మేళా

నెల్లూరు(టౌన్): నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురు,శుక్రవారాల్లో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. (24)7.ఏఐ కంపెనీలో రెగ్యులర్ నాన్ వాయిస్, రెగ్యులర్ వాయిస్ ఉద్యోగాలకు 2017 -2023 మధ్యన ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు రూ.2.94 లక్షల నుంచి రూ.3.18 లక్షల వరకు వార్షిక వేతనం ఉంటుందని వివరించారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈహెచ్‌ఎస్‌లో సభ్యత్వంపై హర్షం

నెల్లూరు(టౌన్): ఎంప్లాయీస్ హెల్త్ స్కీం స్టీరింగ్ కమిటీలో సభ్యత్వం కల్పించడంపై అపస్ జిల్లా అధ్యక్షుడు రాజాగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకం అమల్లోని లోపాలను సరిచేసేందుకు తగిన సూచనలు సలహాలు ఇచ్చి ఉద్యోగులకు నాణ్యమైన ఆరోగ్య సదుపాయాలు కల్పించేలా కృషి చేస్తామన్నారు. ఈహెచ్‌ఎస్ పూర్తిస్థాయిలో అమలయ్యే వరకు మెడికల్ రీయింబర్స్‌మెంట్ స్కీంను కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

కలెక్టర్‌కు వినతి

నెల్లూరు (దర్గామిట్ట) : జిల్లాలోని ఓటర్ల వివరాలు తెలపాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి కలెక్టర్ ఎం హరినారాయణన్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అన్ని రాజకీయ పార్టీలకు అందజేసినట్లే నూతనంగా చేర్చిన, తొలగించిన ఓట్ల వివరాలను తమకు తెలియజేయాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ముత్తుకూరు : విద్యార్థులకు ఏ రంగంలో ఆసక్తి ఉందో తెలియజేస్తే ఆ రంగంలోని నిష్ణాతుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని అదానీ ట్రస్టు ప్రతినిధులు అన్నారు. ముత్తుకూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు శ్రీనివాస్, మోహిత్, బాలచంద్ర తదితరులు ప్రసంగించారు. విద్యార్థులు కోరిన రంగాల్లో రాణించాలంటే ఆయా రంగాల్లో విజయం సాధించిన వ్యక్తుల ద్వారా ప్రత్యేక చర్చా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హైస్కూల్‌లో చదివి బెంగళూరులో సాఫ్ట్‌వేర్‌గా పనిచేసే ఆలపాక మానస విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

మోటార్‌సైకిల్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి వద్ద బుధవారం చోటు చేసుకుంది.. గూడూరుకు చెందిన కిరణ్‌కుమార్ పని నిమిత్తం కృష్ణపట్నం పోర్టుకు మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి గూడూరుకు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మోటార్‌సైకిల్ అదుపుతప్పడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించాలని వినతి


మంత్రి కాకాణిని సత్కరిస్తున్న ఏపీబీఎస్‌ఈఎఫ్ నేతలు

నెల్లూరు (దర్గామిట్ట) : భవిత ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ భవిత స్పెషల్ ఎడ్యుకేటర్ ఫెడరేషన్ (ఏపీబీఎస్‌ఈఎఫ్)రాష్ట్రాధ్యక్షుడు బొమ్మి నాగరాజు కోరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో భవిత ఉపాధ్యాయులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రిని శాలువాతో సత్కరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 2002 నుంచి రాష్ట్రంలోని 672 భవిత కేంద్రాల్లో దివ్యాంగుల విద్యాభివృద్ధికి 980 మంది భవిత ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని తెలిపారు. భవిత ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ (ఎంటీఎస్)ను వర్తింపజేసి రెగ్యులర్ చేసేలా చూడాలని కోరారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా మెరిట్ కం రోస్టర్ విధానంలో ఎంపికై ప్రస్తుతం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న అందరిని రెగ్యులర్ చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లు వర్తింపజేయాలని కోరారు. స్పందించిన మంత్రి కాకాణి 2020 నుంచి ఎస్‌ఎస్‌ఏలో మిగిలిన వారికి పెరిగి ఐఆర్‌పీలకు జీతాలు పెరగకపోవడం బాధాకరమన్నారు. అందుకు గల కారణాలు తెలుసుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి క్యాబినెట్‌లో పెట్టి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీబీఎస్‌ఈఎఫ్ సభ్యులు కాంతిశ్రీ, నర్సింహులు, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరులో సదరన్ ట్రావెల్స్ ప్రారంభం


సదరన్ ట్రావెల్స్‌ను ప్రారంభించిన వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు సిటీ: నగరంలోని మినీబైపాస్‌రోడ్డులోని శ్రీనివాస అగ్రహారం వద్ద సదరన్ ట్రావెల్స్ నూతన బ్రాంచ్‌ను టీటీడీ ఢిల్లీ స్థానిక సలహా కమిటీ చైర్‌పర్సన్, వీపీఆర్ ఫౌండేషన్ కో చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదరన్ ట్రావెల్స్ గత ఐదు దశాబ్దాలుగా టూరిజం సేవలను అందిస్తూ దేశవ్యాప్తంగా శాఖలను కలిగిన ప్రముఖ సంస్థల్లో ఒకటి అని కొనియాడారు. అంతర్జాతీయ పర్యాటక ప్రాంతాల వీక్షణకు సదరన్ ట్రావెల్స్ ప్రయాణికులకు మంచి సేవలు అందిస్తోందన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన సదరన్ ట్రావెల్స్ నెల్లూరు ప్రజలకు సేవలు అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమని తెలిపారు. సదరన్ ట్రావెల్స్ ఎండీ ఆలపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ 1970లో సదరన్ ట్రావెల్స్‌ను స్థాపించామని తెలిపారు. దక్షిణ భారతదేశానికి చెందిన వేలాది మంది ప్రయాణికులకు విశ్వసనీయ ప్రయాణ భాగస్వామిగా ఉందన్నారు. 1500కు పైగా ట్రావెల్స్ ప్యాకేజీలతో అంతర్జాతీయ ప్రయాణాలతో పాటు దేశంలోని ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో పర్యటించేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ నుంచి ఎనిమిది సార్లు అవార్డులు అందుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ ప్రెసిడెంట్ టంగుటూరు రామకృష్ణ, వైస్‌ప్రెసిడెంట్ కోట గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచండి


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట) : ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ వెంకట్రావ్ మండలాధికారులను ఆదేశించారు. బుధవారం డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులు, డ్వామా సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వారం వారం కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కూలీలు చేపట్టిన పనుల కొలతలను ఎప్పటికప్పుడు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కూలీల పేమెంట్లు, పనుల విషయంలో అవకతవకలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాంటేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఉపాధి పనులను నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. నిత్యం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను పర్యవేక్షించాలన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డిని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా వంశీధర్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నరసింహులు నాయుడు, మునిరత్నం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని గ్రామోత్సవం



పొదలకూరు : మండలంలోని నావూరు గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా 8వ రోజైన బుధవారం స్వామి వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది. శ్రీకృష్ణభగవానుడు మనిషిగా జన్మించి నడయాడినట్లు వారు పేర్కొన్నారు. సమితి పొదలకూరు మండల అధ్యక్షుడు పెంచలనర్సయ్య, సభ్యులు కొండయ్య, కృష్ణయ్య, పెంచలయ్య, గోపీ, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.